క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: విద్యుత్ లైన్లకు తాకుతున్న చెట్ల కొమ్మలు తొలగించడంలో భాగంగా శుక్రవారం అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యూసఫ్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తారన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

పరిశుభ్రంగా మండల పరిషత్ కార్యాలయం

సాక్షి ఎఫెక్ట్..

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయం అధ్వానంగా మారడంతో ఈ నెల 16న సాక్షిలో 'అధ్వానంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. గురువారం ఇక్కడ కార్యాలయ ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తా చెదారాలు, పిచ్చి మొక్కలు జేసీబీతో తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. దీంతో కార్యాలయ ప్రాంగణంలో కొత్త వాతావరణం కనిపించింది.

మొరాయించిన లారీ.. రాకపోకలకు అంతరాయం


బస్కి ప్రధాన రహదారిపై మొరాయించిన లారీ

అరకులోయ రూరల్: అరకులోయ నుంచి బస్కి పంచాయతీ వైపు వెళ్తున్న సిమెంటు పైపుల లోడు లారీ మాడగడ సమీప కొండపై మొరాయించింది. ఇక్కడ ప్రధాన రహదారి మధ్యలో నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనికితోడు ఫైబర్ నెట్, కేబుల్ లైన్ల కోసం కాంట్రాక్టర్లు రహదారికి ఆనుకుని తవ్వేసి వదిలేయడంతో మరింత ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పూర్తిగా రాకపోకలు నిలిచాయి. అత్యవసర పనుల కోసం వచ్చిన వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దేవాలయాలను అభివృద్ధి చేయాలి


సమావేశమైన గిరిజన అర్చకుల సంఘం ప్రతినిధులు

గూడెంకొత్తవీధి: గిరిజన ప్రాంతాల్లో పురాతన దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం, దేవదాయ శాఖ చర్యలు తీసుకోవాలని దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు మండల కోఆర్డినేటర్ కంకిపాటి గిరిబాబు కోరారు. మండలంలోని పెదవలసలో గిరిజన అర్చకుల సంక్షేమ సంఘం నాయకులు గురువారం సమావేశమయ్యారు. ఆలయాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొర్రా బలరాం, జర్తా రాజుబాబు, లింగన్నపడాల్, శివయ్య, కృష్ణంరాజు, మంగ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఎంవీవీకి ఘన నివాళి


ఎంవీవీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పార్టీ నేతలు, సర్పంచ్‌లు

కొయ్యూరు: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ 17వ వర్ధంతిని స్థానికంగా ఆయన స్వగృహంలో నిర్వహించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన ఆయన ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని టీడీపీ నేతలు తెలిపారు. ఎంవీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంవీవీకి జోహార్ అంటూ నినాదాలు చేశారు. జీసీసీ మాజీ డైరెక్టర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దుచ్చరి చిట్టిబాబు, బఖీర్ ఖాన్, రేవళ్ల, కొయ్యూరు సర్పంచ్‌లు జె. వెంకటలక్ష్మి, మాకాడ బాలరాజు, మంప మాజీ ఎంపీటీసీ బి.శివరామరాజు, నేతలు అనిశెట్టి చిరంజీవి, కాకూరి చంద్రరావు, మేడిబోయిన చిన్న, మొట్టడం వీరయ్యదొర, వజ్రపు ప్రసాద్, రాము పాల్గొన్నారు.

కుండపోత వర్షాలు

- కల్వర్టుల పైనుంచి భారీగా వరద నీరు
- నిలిచిపోయిన పలు గ్రామాల రాకపోకలు
- నీట మునిగిన పొలాలు


అనంతగిరి: డముకు వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు


కూనవరం: టేకులబోరు- కొండ్రాజుపేట మధ్య వరద ఉధృతి


అరకులోయ రూరల్:వర్షంతో ఖాళీగా ఉన్న అరకు-పాడేరు ప్రధాన రహదారి


జి.మాడుగుల-పాడేరు రోడ్డులో వర్షంతో ప్లాస్టిక్ కవర్లను ఆశ్రయించిన గిరిజన మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గురువారం ఉదయం నుంచి కురిసిన వర్షంతో ప్రధాన గెడ్డలు, వాగులలో వరద ఉధృతి నెలకొంది. గోదావరి, శబరి నదుల్లో వరద ప్రవాహం పెరుగుతుండడంతో ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఈ వర్షాలు ఖరీఫ్ వ్యవసాయ భూములకు మాత్రం ఎంతో మేలు చేశాయి. మడుల నిండా పుష్కలంగా నీరు చేరింది. గిరిజనులంతా గొడుగులు, ప్లాస్టిక్ కవర్లు ఆశ్రయించి వ్యవసాయ పనులు చేపట్టారు.

ముంచంగిపుట్టు: అల్పపీడన ప్రభావంతో మండలంలో వర్షాలు ముంచెత్తాయి. వీడకుండా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో జన జీవనం స్తంభించింది. వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లపై నుంచి కల్వర్టులపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నీటి ప్రవాహంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. పంట పైర్లపై మట్టి మేటలు వేసి దర్శనమిస్తున్నాయి. ముంచంగిపుట్టు మండలంలో ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల మధ్య బిరిగూడ వద్ద వరద ప్రవాహం అధికమై తాత్కాలిక కల్వర్టుపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహించింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే గిరిజనులు ఎటువారు అటు ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరద ప్రవాహం అధికంగా ఉండటంతో రాకపోకలు అప్పటి వరకు నిలిచిపోయాయి. ఐదు గంటల తర్వాత కాస్త నీటి ప్రవాహం తగ్గడం రాకపోకలు కొనసాగాయి. బుంగాపుట్టు, కోడాపుట్టు, ఉబ్బెంగుల, దొరగూడ, మాలిపుట్టు గ్రామాలకు చెందిన ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతూ బైకులను మోసుకుని వాగును అతికష్టం మీద దాటించి ఆయా గ్రామాలను చేరుకున్నారు. కించాయిపుట్టు పంచాయతీ సరియాపుట్టు గ్రామనికి వెళ్లే మార్గంలో కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు సైతం గ్రామానికే పరిమితమయ్యారు. లక్ష్మీపురం, బుంగాపుట్టు, రంగబయలు, బూసిపుట్టు పంచాయతీల్లో పలు వాగులు వరద ప్రవాహంతో 38 గ్రామాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. జర్రెల, కరిముఖీపుట్టు, పెదగూడ, కించాయిపుట్టు, మాకవరం పంచాయతీల్లో పొలాలు నీట మునిగాయి. వరద నీటి ఉధృతికి పొలాల్లో మట్టి దిబ్బలు కొట్టుకు వచ్చి మేటలు వేశాయి.

అరకులోయ రూరల్: మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు వాతావరణం అనుకూలించలేదు. వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు, ప్రయాణికులు, వివిధ వ్యాపార సముదాయాల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వర్షం కారణంగా గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అనంతగిరి: మండలంలో మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాల్లో గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. రొంపల్లి, పెదకోట, పినకోట, కివర్ల, చిలకలగెడ్డ, గుమ్మకోట పంచాయతీల్లో గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఘాట్‌రోడ్డు వరద నీరు భారీగా ప్రవహించడంతో రోడ్డుపై మట్టి, రాళ్లు చేరడంతో ప్రయాణాలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సామాజిక భద్రత మనందరి బాధ్యత


హెల్మెట్ ధారణపై అడ్డతీగలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డతీగల: సామాజిక భద్రత అనేది మనందరి బాధ్యతగా సమాజం గుర్తించుకోవాలని మండల లీగల్ కమిటీ చైర్మన్ పి.బాబు తెలిపారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు అడ్డతీగల లీగల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సీతపల్లి జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్, గాంధీ సెంటర్ మీదుగా వాల్మీకి నగర్ వరకూ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా మండల లీగల్ కమిటీ చైర్మన్ పి.బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే అంశంపై సామాజిక భద్రతలో భాగంగా ర్యాలీ నిర్వహించామన్నారు.

రెండో విడత దోమల నివారణ మందు పిచికారీ


దోమల నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న ఏఎంవో శ్రీనివాసరాజు


సీహెచ్‌సీలో డెంగ్యూ కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎంవో శ్రీనివాసరాజు

వై.రామవరం: మండలంలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో 2వ విడత దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామని జిల్లా అసిస్టెంటు మలేరియా అధికారి (ఏఎంవో) శ్రీనివాసరాజు తెలిపారు. చింతకర్రపాలెం, వై.రామవరం గ్రామాల్లో గురువారం ఆయన పిచికారీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంట్లోను లోపల, బయట, డ్రైనేజీలోను తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించాలని సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆయన స్వయంగా స్ప్రేయింగ్ చేయించారు. ఆస్పత్రిలో డెంగ్యూ కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ నమోదైన మలేరియా కేసులపై ఆరా తీశారు. ప్రతీ ఇంట్లోను తప్పనిసరిగా స్ప్రేయింగు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో మలేరియా రికార్డులు పరిశీలించారు. ల్యాబ్‌లో చేస్తున్న రక్తపరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దినేష్, నరేంద్ర, మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్ష


విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న తహసీల్దారు, ఆర్ఎస్ డీటీ సత్యనారాయణ

కొయ్యూరు: గిరిజన విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని తహసీల్దారు డి. రాజేశ్వరరావు ఆకాంక్షించారు. గురువారం బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల జీపీఎస్ టీడబ్ల్యూ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నప్పట్నుంచి కలలు కని, వాటిని నిజం చేసుకునేందుకు కష్టపడాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యతను తెలిపారు. పిల్లలను విధిగా బడికి పంపాలని సూచించారు. ఆర్ఎస్ డీటీ దుమంతి సత్యనారాయణ, వీఆర్వో పండయ్య, కంప్యూటర్ ఆపరేటర్ లోవరాజు, ఏఎస్‌వో చైతన్య, ప్రసాద్, ఉపాధ్యాయులు పురం అప్పారావు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్

హుకుంపేట: వాహనచోదకులు సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని జిల్లా రవాణశాఖ అధికారి లీలాప్రసాద్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం, రోడ్డు భద్రతలో మరణాల రేటును తగ్గించడంపై గురువారం స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రమాద వృద్ధి రేటు 43.75 శాతం, మరణాల రేటు 70 శాతం పెరుగుదల నమోదు చేయబడిందన్నారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వాహనాలు నడుపు సమయంలో నిబంధనలు పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

తుమ్మపాల: స్థానిక ఏఎంఏఎల్ కళాశాలను గురువారం నాక్ అక్రిడిటేషన్ జాతీయ బృందం సందర్శించింది. హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ హస్‌రాజ్ శర్మ, తమిళనాడు కోయంబత్తూరు హోమ్ సైన్స్ అండ్ హయర్ ఎడ్యుకేషన్ ఆఫ్ వుమెన్ డీన్ డాక్టర్ జెరీనాబి ఉబైదుల్లా, కర్ణాటక ఎ.వి.కాంతమ్మ ఉమెన్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజకుమారి జవరాజిగౌడ.. కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలు, వసతి, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. నాక్ అక్రిడిటేషన్ గుర్తింపునకు అనువైన అంశాలను, ప్రమాణాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ప్రొఫెసర్ హస్‌రాజ్‌శర్మ పాల్గొన్నారు.

నలుగురికి పింఛన్లు ఇవ్వకపోవడంపై విచారణ

కొయ్యూరు: మూలపేట పంచాయతీ జజులబంధలో ఏప్రిల్, మే నెలలో నలుగురు పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేయలేదని అందిన ఫిర్యాదుపై విచారణకు ఆదేశించామని ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం తెలిపారు. పాంగి రామారావు, వంతల కోనె, పాంగి సుబ్బారావు, పాంగి బిరుసులకు పింఛన్లు ఇవ్వకపోవడంతో పీవో నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మేరకు మూలపేట కార్యదర్శి రవీంద్ర, బాలారం కార్యదర్శి ఎస్. రవికుమార్ విచారణ నిర్వహిస్తారన్నారు. వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

గుడ్లపల్లిలో పారిశుధ్య మెరుగుకు చర్యలు


ట్రాక్టర్‌తో తొలగిస్తున్న చెత్త

కొయ్యూరు: మర్రివాడ పంచాయతీ గుడ్లపల్లిలో రోడ్ల పక్కన, వీధుల్లో చెత్తాచెదారాలు తొలగించారు. ఎంపీడీవో సీతయ్య ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి గురువారం చర్యలు తీసుకున్నారు. ఇక్కడ తుప్పలను, చెత్తను తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే, ఎలాంటి రోగాలు రావని ఈ సందర్భంగా ఎంపీడీవో తెలిపారు. వర్షాలకు గోతుల్లో నీరు చేరడం మూలంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో పారిశుధ్య మెరుగుకు చర్యలు తీసుకున్నారు.

సకాలంలో వరినాట్లు


రైతులతో మాట్లాడుతున్న ఏవో మధుసూదనరావు

గూడెంకొత్తవీధి: ప్రస్తుతం మన్యంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయని, గిరిజన రైతులు ఆలస్యం చేయకుండా వరినాట్లను ముమ్మరం చేయాలని ఏవో మధుసూదనరావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. రైతుల పొలాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ ఏడాది మండలంలో 7,500 ఎకరాల్లో వరినాట్లు పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట ఎరువులతోపాటు మేలు రకపు వరి విత్తనాలను ఈ ఏడాది ముందుగానే రైతులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ జగదీష్ పాల్గొన్నారు.

2 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

పాయకరావుపేట : మండలంలో గల నామవరం సమీపాన మోటారు సైకిల్‌పై 2 కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. నక్కపల్లి మండలం చినరాంభద్రపురం గ్రామానికి చెందిన వ్యక్తి గంజాయిని 100 గ్రాముల పొట్లాలు కట్టి, ఒక్కొక్క పొట్లం 200 రూపాయిలకు అమ్మకం సాగిస్తున్నట్లు గమనించినట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జోగారావు తెలిపారు.

టోంగికోట పాఠశాల భవనానికి ప్రతిపాదనలు

ముంచంగిపుట్టు: మండలంలో వనభసింగి పంచాయతీ టోంగికోట ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామని మండల విద్యా శాఖాధికారి కె.కృష్ణమూర్తి తెలిపారు. టోంగికోటలో గురువారం ఆయన పర్యటించారు. ఇక్కడ ఇటీవల కూలిపోయిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. తాత్కాలిక పాఠశాల భవనం నిర్మించిన గ్రామస్తులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు భవనం లేక పడుతున్న ఇబ్బందులను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పాఠశాల భవనం పనులు మొదలు పెడతామన్నారు. తాత్కాలిక షెడ్డులో పాఠశాల నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, సీఆర్పీ అనిల్, ఉపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం

ముంచంగిపుట్టు: జెడ్పీ నిధులతో తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పాంగి పద్మారావు తెలిపారు. కర్రిముఖిపుట్టు పంచాయతీ మొక్కపుట్టు గ్రామంలో జెడ్పీ నిధులు రూ.1.40 లక్షలతో నూతన బోరు ఏర్పాటు పనులకు జెడ్పీ చైర్‌పర్సన్ భర్త జె.వి.వి.ఎస్. మూర్తి, సర్పంచ్ పుల్‌మోతి, నాయకులతో కలిసి గురువారం ఆయన టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు మాట్లాడుతూ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో తాగునీటి కష్టాలు తీరుతున్నాయన్నారు. నీటి సమస్య ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా పరిష్కరిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ నిధులతో మరింత అభివృద్ధి పనులు చేయాలని కోరారు. నీటి సమస్య తీరడంతో మొక్కపుట్టు గ్రామ గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తూ జెడ్పీ చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప సర్పంచ్ సాధురాం, వైఎస్సార్‌సీపీ మండల నేతలు అర్జున్, రాంప్రసాద్, రాంబాబు, జగన్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం మంజూరుకు డిమాండ్

ముంచంగిపుట్టు: పెదగూడ పంచాయతీ పనస గ్రామంలో ఎంపీపీ పాఠశాలకు పక్కా భవనం మంజూరు చేయాలని టీడీపీ డివిజన్ నేత, దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి డిమాండ్ చేశారు. గురువారం పనస గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వీరికి సర్పంచ్ మద్దతు పలికారు. పలుమార్లు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని తెలిపారు. కలెక్టర్ స్పందించి తక్షణమే పాఠశాలకు భవనం మంజూరు చేయాలన్నారు. మాజీ సర్పంచ్ నరంజి ప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

23 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పక్కన హౌసింగ్ ఏఈ సూరిబాబు

గూడెంకొత్తవీధి: మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఆధార్ సర్వేను పరిశీలించాలన్నారు. ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారంతా మరోసారి తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. ప్రస్తుతం ఆధార్ కేంద్రాలకు అదనంగా 23 నుంచి 27 వరకూ ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఏఈ సూరిబాబు పలు సూచనలు చేశారు. త్వరితగతిన ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. 90 రోజుల ఉపాధి పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డిజిటల్ నాలెడ్జ్‌పై గిరి యువతకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్‌బాలరాజు

అరకులోయ టౌన్: ప్రభుత్వ రాయితీలు, పథకాలపై గిరిజన యువత అవగాహన కలిగి ఉండాలని నేచర్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజు తెలిపారు. మండలంలోని పద్మాపురం నేచర్ క్రియాశీల ప్రాంగణంలో గురువారం యువతకు డిజిటల్ నాలెడ్జ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గిరిజన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో జరిగే గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

విద్యార్థులకు తమ సంస్థ ద్వారా వృత్తి, నైపుణ్య శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పీజీ, డిగ్రీ చదివిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నేచర్ ప్రతినిధులు టి. సంతోష్‌కుమార్, అద్దు, ఎం. ప్రసాద్, గౌరీశంకర్, పి. రవికుమార్, అజయ్, నాగేశ్వరరావు, సుమన్, మౌనిక, శాంతి, గన్నెల, లోతేరు, ఇరగాయి పంచాయతీ యువతీ యువకులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఇంటింటా వైద్య సేవలు


గిరిజనులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పాడేరు: మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీడిపగడ, అలజేరు, చింతగున్నల, మాతికబంద, వరంకూర, వనుగుపల్లి, తామరాపల్లి గ్రామాల్లో జ్వర బాధితులకు గురువారం వైద్య సిబ్బంది సేవలందించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా వెళ్లి జ్వరపీడితులను గుర్తించి చికిత్సలు అందించారు. మందులను అందజేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని అవగాహన కల్పించారు. 200 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో ఎవరికైనా అనారోగ్యం చేస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు. ఎంపీహెచ్ఈవో జి. సింహాద్రి, హెచ్.వి. వరలక్ష్మి, సరోజిని, హెల్త్ అసిస్టెంట్లు శెట్టి నాగరాజు, కె.లక్ష్మణరావు, చలం, పడాల్, నాగరాజు, వై.వి. రమణ, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల వినియోగంతో అధిక ఉత్పత్తులు


యంత్రాలను పరిశీలించి, రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్న ఏవో శ్రీనివాస్

చింతపల్లి రూరల్: యంత్రాలను ఉపయోగించి రైతులు అధిక ఉత్పత్తులు సాధించి లాభాలను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో చౌడుపల్లి, గాడిదలమెట్ట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యంత్ర సేవా పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై ఇచ్చిన వ్యవసాయ పనిముట్ల వినియోగాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు రైతులకు అందించారు. వరిలో బాటలు తీయడం వల్ల ఎక్కువ గాలి పైరులోకి ప్రవేశించి దుబ్బులకు అధిక ఆక్సిజన్ అందిస్తుందన్నారు. దీని వల్ల మొక్కలలో కిరణజన్య సంయోగ క్రియ బాగా జరిగి మొక్కలు పచ్చదనంతో నిండి అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. వరిలో దోమపోటు ఉధృత తగ్గుతుందన్నారు. బాటలు తీసి ఎరువులు చల్లడం వల్ల చేలకు బాగా అందుతుందన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.